# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ న్యూ ఢిల్లీలో సమావేశమయ్యారు.

❖ పి.ఎం. గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళిక నేటితో 4 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

❖ బీహార్‌లో రెండవ విడత అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ జారీ చేసింది.

❖ ఆర్పీఎఫ్ నియామక ప్రక్రియను ఇకపై స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (SSC) ఏటా నిర్వహిస్తుందని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

=========================

భారత పర్యటన నిమిత్తం ఈరోజు న్యూఢిల్లీ చేరుకున్న కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. అనితా ఆనంద్‌కు ప్రధాని స్వాగతం పలుకుతూ.. భారత్-కెనడా ద్వైపాక్షిక భాగస్వామ్యంలో వేగాన్ని పెంచే దిశగా కొనసాగుతున్న ప్రయత్నాలకు ఆమె పర్యటన తోడ్పడుతుందన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, ప్రజా సంబంధాల మధ్య సహకారం విస్తరించాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి ఆమెకు వివరించారు. అనితా ఆనంద్ అంతకుముందు భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తో సమావేశమై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ...

(వాయిస్ 33 సెకన్లు)

=========================

భారతదేశంలో అన్ని రవాణా విధానాలను ఏకీకృతం చేయాలని ప్రారంభించిన “పి.ఎం. గతిశక్తి” పథకం నేటితో 4 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన పి.ఎం. గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళిక 4వ వార్షికోత్సవంలో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ పాల్గొన్నారు. ఈ

సందర్భంగా  పి.ఎం. గతిశక్తి పబ్లిక్ ప్లాట్‌ఫామ్, పి.ఎం. గతిశక్తి ఆఫ్‌షోర్, లీప్స్ 2025 వంటి పలు కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. ఈ చొరవ స్థూల ప్రణాళిక, సూక్ష్మ నిర్వహణ మధ్య వారధిగా పని చేసిందన్నారు. సమగ్ర ప్రణాళిక, ప్రాంతీయ ఆధారిత అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను పి.ఎం. గతిశక్తి ప్రతిబింబిస్తుందని చెప్పారు. పి.ఎం. గతిశక్తి పరిధి మరింత విస్తరిస్తోందని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

క్లిష్టమైన కార్డియాక్ కేసుల సమయంలో ప్రాణాలను రక్షించే కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ రోజు సీపీఆర్ అవగాహన వారోత్సవాలను ప్రారంభించింది. ఈ వారోత్సవాలను కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఆరోగ్య నిపుణులు, వైద్య సంస్థలకు చెందిన ప్రతినిధులు, పౌరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుణ్య సలిల శ్రీవాస్తవ మాట్లాడుతూ.. ఆరోగ్య నిపుణుల సహాయం దక్కేలోపు హ్యాండ్స్-ఓన్లీ సీపీఆర్ చేయడం ద్వారా ముఖ్యమైన అవయవాలకు రక్త సరఫరా కొనసాగేలా ఆక్సిజన్ అందేలా చేయవచ్చన్నారు. ఇది అత్యవసర సమయాల్లో ప్రాణాలు నిలిపే అవకాశాలను ఎన్నో రెట్లు పెంచుతుందని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

==========================

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (RPF) నియామక ప్రక్రియను ఇకపై స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (SSC) ఏటా నిర్వహిస్తుందని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గుజరాత్‌లోని వల్సాద్‌లో జరిగిన RPF 41వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో RPF దళాన్ని అప్‌గ్రేడ్ చేసే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ.. RPF సిబ్బందికి త్వరలో VHF రేడియో సెట్‌లను అందిస్తామని చెప్పారు. అలాగే విధి నిర్వహణలో వారి కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడానికి అధునాతన డిజిటల్ మరియు డ్రోన్ శిక్షణను కల్పిస్తామన్నారు. రాబోయే దీపావళి, ఛత్ పండుగలను దృష్టిలో పెట్టుకొని ప్రయాణీకుల డిమాండ్ మేరకు భారతీయ రైల్వే 12 వేల ప్రత్యేక రైళ్లను నడుపుతోందని అశ్విని వైష్ణవ్ చెప్పారు.

విరామం

==========================

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారతదేశానికి అధునాతన సాంకేతికత, ఐటీ ఆధారిత పరిష్కారాలు అవసరమని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. రాబోయే సంవత్సరాల్లో విద్యార్థులు వీటిని సృష్టిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2025 వికసిత్ భారత్ బిల్డ్ థాన్ ను న్యూ ఢిల్లీలో ఆయన ఈరోజు ప్రారంభిస్తూ... 21వ శతాబ్దం జ్ఞాన ఆధారిత శతాబ్దం అని ఈ జ్ఞాన ఆధారిత ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థను దేశం నడిపించబోతోందని చెప్పారు. విద్యా మంత్రిత్వ శాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వికసిత్ భారత్ బిల్డ్ థాన్ చొరవ 6 నుండి 12 తరగతుల వరకు విద్యార్థులు తమ సృజనాత్మకత, పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించడానికి పాఠశాలలు, ఉపాధ్యాయులను ఆహ్వానిస్తోంది.

==========================

ఆర్థిక శాస్త్రానికి సంబంధించి ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారం ఈ సంవత్సరం ముగ్గిరిని వరించింది. జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియన్, పీటర్ హౌయిట్ లను ఈ ఏడాది ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. నిరంతర వృద్ధికి నూతన సాంకేతికత ఎలా దోహదం చేయగలదో వారు వివరించినట్లు అకాడమీ పేర్కొంది. వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన నేటితో ముగిసింది. డిసెంబర్ 10న ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా గ్రహీతలకు ఈ పురస్కారాలను అందజేస్తారు.

==========================

గత సంవత్సరం అమల్లోకి వచ్చిన మూడు నూతన నేర చట్టాలు న్యాయ వ్యవస్థను వేగవంతం చేశాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈ చట్టాలు అమలులోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా జైపూర్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో అమిత్ షా ఈరోజు పాల్గొని ప్రసంగించారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిని శిక్షించేలా ప్రత్యేక నిబంధనలను ఈ చట్టాల్లో పొందుపరిచామన్నారు. కొత్త చట్టాలు బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చూస్తాయని.. వీటి అమలు 21వ శతాబ్ధపు అత్యంత ముఖ్యమైన న్యాయ సంస్కరణలలో ఒకటిగా ఆయన అభివర్ణించారు.

(వాయిస్ 28 సెకన్లు)

==========================

బీహార్‌లో రెండవ విడత అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో 20 జిల్లాల పరిధిలోని 122 అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రెండవ దశకు నామినేషన్లు దాఖలు చేయడానికి ఆఖరి తేదీ అక్టోబర్ 20 కాగా, నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 21న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 23 వరకూ అవకాశం ఉంటుంది. ఈ రెండవ విడత పోలింగ్ నవంబర్ 11న జరుగుతుంది. అదే విధంగా ఏడు రాష్ట్రాల పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు సైతం ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ జారీ చేసింది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 500 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 173 పాయింట్లు నష్టపోయి 82 వేల 327 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్లు క్షీణించి 25 వేల 227 వద్దకు చేరింది.

==========================
==========================